# బస్సుకు రూటు క్లియర్.. మరి నడిచేది ఎప్పుడు?

## బస్సు నడిచేలా అధికారులు, నాయకులు చొరవ చూపాలి

రామకృష్ణాపూర్ ఏప్రిల్ 23 (వాయిస్ టుడే): క్యాతనపల్లి మున్సిపాలిటీ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూసిన క్యాతనపల్లి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పూర్తి అవడంతో రాకపోకలు సాగుతున్నాయి. ఫ్లై ఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలకు ఆటంకాలు తొలగిపోయాయి. వాహన దారులు సులభంగా వెళ్లడమే కాక సమయం కూడా ఆదా అవుతుంది. అయినప్పటికీ ప్రధాన సమస్య ఆయన పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ సౌకర్యం ఆర్టీసీ బస్సు లేకపోవడం మాత్రం స్థానిక ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఒకప్పుడు ఈ ప్రాంతం సింగరేణి కార్మిక క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. ప్రజల అవసరాల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఆటోలు,ప్రైవేటు బస్సులపై ఆధారపడేవారు. ఆ తర్వాత అడపాదడపా ఆర్టీసీ బస్సు నడిచిన రైల్వే గేట్ వద్ద గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. ఆదాయం లేకపోవడం తద్వారా ఆర్టీసీ బస్సును రద్దు చేశారు. నిత్యం ఈ మార్గం గుండా పట్టణ పరిధిలోని ప్రజలు, విద్యార్థులు,ప్రైవేట్ ఉద్యోగులు చిరు వ్యాపారులు



జిల్లా కేంద్రమైన మంచిర్యాలకి వెళ్లాలంటే ఆటోలకు అధిక ధరలు చెల్లిస్తూ ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రయాణ ఖర్చు అధికమవుతుంది. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. ఈ సమస్యను పరిష్కరించాలంటే స్థానిక ప్రజలు కోరుతున్నట్టుగా కనీసం ప్రధాన సమయాల్లో మూడు ,నాలుగు ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు, ప్రైవేట్ ఉద్యోగులకు పేద, మధ్యతరగతి ప్రజలు వెళ్లే సమయాల్లో వారికి బస్సులు అందుబాటులో ఉంటే మరింత ఊరట కలుగుతుంది. ముఖ్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన



ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్థానిక నాయకులు, ప్రజాసంఘాల నాయకులు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఆర్టీసీ బస్సులు నడిచే విధంగా కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

**మంచిర్యాల నుంచి రామకృష్ణాపూర్ కు బస్సును నడపాలంటే ప్రజా ప్రతినిధులు మెమరాండం ఇస్తే రూట్ మ్యాప్ పరిశీలిస్తాం.**

**– మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ జనార్ధన్**



### భారంగా మారిన రవాణా ఖర్చులు

నిత్యం పట్టణ పరిధిలోని వందలాదిమంది ఉపాధి కోసం మంచిర్యాలకు వెళ్తుంటారు. వారికి రవాణా ఖర్చులు భారంగా మారుతున్నాయి. బస్సు సౌకర్యం కల్పిస్తే ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే వారికి సైతం ఊరట లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– రాజలింగు మోతే( అడ్వకేట్),
సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్ అధ్యక్షులు


### మా ఊరికి బస్సు సౌకర్యం కల్పించండి

ప్రతి రోజునేను ఆటోలో మంచిర్యాలలో హోటల్లో పనికి వెళ్తున్నా. ఆటోకు వెళ్లాలంటే అధిక చార్జీలు చెల్లిస్తూ వెళ్లాల్సి వస్తుంది. క్యాతనపల్లి బ్రిడ్జి పూర్తయినందు వల్ల బస్సు సౌకర్యం కల్పిస్తే ఉపాధి కోసం వెళ్లే వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది.



– పొట్ట రాజేశ్వరి రామకృష్ణాపూర్

## హెడ్ కానిస్టేబుళ్ల కుమారులు సివిల్స్ ర్యాంకర్లు





వరంగల్‌క్రైం, గిర్మాజిపేట: వరంగల్ జీఆర్పీ విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ గంగాధరి సుదర్శన్ కుమారుడు గంగాధరి విక్రమ్ సివిల్ సర్వీస్‌లో 814వ ర్యాంకు సాధించారు. హనుమకొండ రాంనగర్‌లో నివాసం ఉండే విక్రమ్ చిన్నప్పటి నుంచి చదువులో చురుకైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు. హనుమకొండ సెయింట్ పీటర్స్ పాఠశాలలో పదో తరగతి వరకు, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా, కాకతీయ యూనివర్శిటీలో బీటెక్ పూర్తిచేశారు. ఆయన ప్రస్తుతం ఐబీ ఇన్‌స్పెక్టర్‌గా నెల్లూరులో పనిచేస్తున్నారు. ఐపీఎస్ లక్ష్యంగా ఇప్పటి వరకు మూడుసార్లు సివిల్స్ రాశానని, ఈసారి కూడా రాకపోతే.. మరోసారి ప్రయత్నిస్తానని విక్రమ్ తెలిపారు.

ఎన్జీవోస్‌కాలనీ: సివిల్స్‌లో గిరిజన యువకుడు ప్రతిభ చాటి ర్యాంకు సాధించారు. హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని శ్రీలక్ష్మినగర్ కాలనీకి చెందిన భానోత్ సక్రమ్–పద్మ దంపతుల కుమారుడు భానోత్ శ్రీనికేష్ నాయక్ జాతీయ స్థాయిలో 938వ ర్యాంకు తెచ్చుకున్నారు. నాలుగు సార్లు విఫలమై ఐదో ప్రయత్నంలో విజయం సాధించినట్లు చెప్పారు. తల్లి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కాగా.. తండ్రి హనుమకొండ ఠాణాలో హెడ్ కానిస్టేబుల్. శ్రీనికేష్ నాయక్ పదో తరగతి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చదివారు. ఇంటర్ హైదరాబాద్‌లో, బీటెక్ ఐఐటీ దిల్లీలో పూర్తి చేశారు. సివిల్స్ లక్ష్యంతో దిల్లీలోనే రెండేళ్ల పాటు శిక్షణ తీసుకున్నారు. ఇటీవల ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో సైతం జోనల్ స్థాయిలో ఐదో ర్యాంకు సాధించారు.



## కల్యాణకట్టలో క్షురకుల మధ్య వివాదం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన కల్యాణకట్టలో క్షురకుల (నాయీబ్రాహ్మణుల) మధ్య బుధవారం ఉదయం వాగ్వాదం జరిగింది. శ్రీస్వామి కల్యాణకట్టలో స్థానికంగా రెవెన్యూ గ్రామం యాదగిరిపల్లికి చెందిన నాయీబ్రాహ్మణులే 96 మంది కమీషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కొందరు స్థానికేతరులని, వారి స్థానంలో తమకు అవకాశం కల్పించాలని యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన నాయీబ్రాహ్మణులు కోరుతూ కోర్టును ఆశ్రయించి, అనుకూల తీర్పు పొందారు. సదరు తీర్పును అమలుచేసేందుకు ఆలయ ఈవో 20 మందికి ఆలయ కల్యాణకట్టలో విధుల నిర్వహణకు ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాలతో కల్యాణకట్టలోకి రానీయకుండా ప్రస్తుతం పనిచేస్తున్న వారు అడ్డుకున్నారు. గంటపాటు విధులు నిలిచిపోయాయి. ఆలయ ఏఈవోలు రమేశ్‌బాబు, కృష్ణ, రఘు కోర్టు ఉత్తర్వు ప్రకారం ఈవో అనుమతి ఇచ్చారంటూ నచ్చజెప్పడంతో ఆ రెండు బృందాలు కలిసి విధుల్లో పాల్గొన్నాయి. రెండు వర్గాల మధ్య గొడవను సద్దుమణిచేందుకు ఆలయ భద్రతా సిబ్బంది కృషి చేసింది. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించే భక్తులు ఒకరికి రూ.50 టికెట్ ఖరీదు చేయాలి. ఆ టికెట్‌పై దేవస్థానం క్షురకులకు రూ.30 కమీషన్ చెల్లించే విధానం ఒప్పందం ప్రకారం కొనసాగుతుంది.

# జనసమీకరణ ఏర్పాట్లను సమన్వయం చేయండి



బాలసముద్రం: ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు జనసమీకరణ ఏర్పాట్లు ముమ్మరం చేయాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్యనేతలతో కలిసి బుధవారం ఎల్కతుర్తి సభాస్థలిని పరిశీలించారు. అనంతరం హనుమకొండ రాంనగర్‌లోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసానికి చేరుకున్నారు. అక్కడ సభ ఏర్పాట్లపై సమీక్షించారు. ప్రజలు సభకు రావడానికి ఆసక్తి చూపుతున్నారని, ఏర్పాట్ల విషయంలో ఎలాంటి లోపాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలో పర్యటించి అవసరమైన సలహాలు, సూచనలివ్వాలని దయాకర్‌రావుకు సూచించారు. కేటీఆర్ తిరిగి వెళ్లే క్రమంలో పార్టీ శ్రేణులు, అభిమానులు సెల్ఫీ తీసుకోవడానికి పోటీ పడ్డారు. సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, మాజీ మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, శంకర్‌నాయక్, గండ్ర వెంకట రమణారెడ్డి, నరేందర్, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, నేతలు ఏనుగుల రాకేష్ రెడ్డి, కేశిరెడ్డి వాసుదేవరెడ్డి తదితరులున్నారు.

**సభలో 2 వేల మంది భారాస వాలంటీర్ల సేవలు**

భీమదేవరపల్లి, ఎల్కతుర్తి: భారాస రజతోత్సవ సభకు 60 లక్షల గులాబీ దండు కదిలిరావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ భారాస మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, నాయకులతో కలిసి బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. కేటీఆర్‌ను చూడగానే భారాస శ్రేణులు సీఎం...సీఎం అంటూ నినాదాలు చేశారు. వరంగల్‌కు చెందిన యువకులు తయారుచేసిన పాటల సీడీని కేటీఆర్, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిలు ఆవిష్కరించారు. సభలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా 2 వేల మంది భారాస వాలంటీర్లు సేవలందిస్తారని తెలిపారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మూడు రూట్లలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని కేటీఆర్ వివరించారు. 30 వేలకుపైగా వాహనాలు వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలవారీగా ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. భారాస వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీఆర్ ప్రత్యేక హెలికాప్టర్‌లో సాయంత్రం 4.30 గంటలకు సభకు చేరుకుంటారని చెప్పారు.



## ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించిన రెబ్బెన గురుకుల విద్యార్థులు

**రెబ్బెన:** నిన్న విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో రెబ్బెన సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మొదటి సంవత్సరం ఎంపీసీ బైపీసీ కలిపి 69 మంది విద్యార్థులు ఉండగా, అందరూ ఏ గ్రేడ్ తో ఉత్తీర్ణతల సాధించడం జరిగింది. ఇంటర్ ఫైనల్ ఇయర్ ఎంపీసీ, బైపిసి కలిపి 80 మంది విద్యార్థులు ఉండగా 78 మంది ఏ గ్రేడ్ తో, ఇద్దరు బి గ్రేడ్ తో ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని ఇన్చార్జి ప్రిన్సిపల్ ఆత్రం చైతన్య తెలిపారు. ఎంపీసీ ఫైనల్ ఇయర్ లో సాలిగం హారిక 987/1000 మార్కులతో మండల టాపర్ గా నిలిచింది. బైపీసీ ఫైనల్ ఇయర్ లో జాడి జయరాణి 981/1000 మార్కులతో బైపీసీలో మండల టాపర్ గా నిలవడం జరిగింది. రెబ్బెన మండల కేంద్రానికి చెందిన హారిక తల్లిదండ్రులు సంతోష్, భాగ్య తమ వృత్తి పనులు చేసుకుంటూ చదివించడం జరిగింది. కౌటాల మండలానికి చెందిన జాడి జయరాణి తల్లిదండ్రులు రాంకుమార్, సునీత వ్యవసాయం చేసే చదివించడం జరిగింది. జూనియర్ ఎంపీసీలో ఎం సుప్రియ 454/470, జూనియర్ బైపీసీలో , కే ప్రహర్షిత 423/440 కళాశాల టాపర్స్ గా నిలవడం జరిగింది.



## ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా వేజెండ్ల సాయి

**భారీ మెజార్టీతో విజయం సాధించిన సాయి.**

**సంబరాల్లో వేజెండ్ల సాయి అభిమానులు**



**ఎర్రుపాలెం :** యువజన కాంగ్రెస్ ఫలితాలలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా భారీ మెజార్టీతో విజయం సాధించిన మధిర నియోజకవర్గం కు చెందిన వేజెండ్ల సాయికుమార్. ఈ విజయంతో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పనిచేస్తూ ఉప ముఖ్యమంత్రి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అలాగే నందిని విక్రమార్క పేరు నిలబెడుతూ మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. తన ప్రత్యర్థి ఎడ్లపల్లి సంతోష్ కుమార్ పై 7700 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొంది జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్థానాన్ని వశం చేసుకున్న వేజెండ్ల సాయి. కాంగ్రెస్ పార్టీలో అటు నాయకులతోనూ కార్యకర్తలతోనూ ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని తన పేరును చాటుకున్నారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క బాటలో నడుస్తూ అభిమానుల గుండెల్లో స్థానాన్ని నిలబెట్టుకున్న ఏజెండ్ల సాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెలిచిన వేజెండ్ల సాయిని ప్రతి ఒక్కరు అభినందిస్తూ ధన్యవాదాలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇళ్లలో అర్హులకు న్యాయం చేయండి

**వెన్నెల నగర్ లబ్ధిదారుల న్యాయ పోరాటం**

**807 నిరుపేదల న్యాయ గళం - ఇంకెన్ని రోజులు ఊరుకుంటాం?**



**కొత్తగూడెం/ లక్ష్మీదేవి పల్లి :** వెన్నెల నగర్‌లో నివసిస్తున్న 807 మంది అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల మంజూరు చేయాలని, ఇద్దరు కన్నులుంటూ కూడా అంధుల్లా వ్యవహరిస్తున్న అధికారులపై నిరసన వెలువడుతోంది. “సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ” కన్వీనర్ జలాల్ ప్రభుత్వాన్ని, అధికార యంత్రాంగాన్ని ఉద్దేశించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండో విడత సర్వే పేరుతో అర్హుల నుంచి కొందరిని తొలగించి, ఇండ్లున్నవారిని ఎంపిక చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన, “ఇల్లు ఉన్నవారికి మళ్లీ ఇల్లు, ఇల్లు లేని వారికి ఏమిటి ఈ అన్యాయం?” అంటూ నిలదీశారు. అసలు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రజల నుంచి దాచిపెట్టి, కాలయాపన చేయడాన్ని ఆయన “ఇదిగో పులి అదిగో మేక” వ్యవహారంగా పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు తమ బాధ్యతను మరిచి వ్యవహరిస్తే ప్రజల ముందు వారిని దోషులుగా నిలబెడతామని హెచ్చరించారు. ఇందిరమ్మ విగ్రహం వద్ద చేతులతో కళ్లుమూసుకొని “కళ్లులేని ప్రభుత్వం %-% వినిపించని అధికారులు” అంటూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసయ్య, రామయ్య, సరోజ, నిరోషా, రాజా, హైమద్, సికిందర్, ఖాదర్, బన్సీ తదితరులు పాల్గొన్నారు.